
ప్రజాశక్తి నారి సంక్రాంతి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

# రోమ్ - నీరో - ఫిడేలు



"మనం కాడి కింద పడెయ్యక తప్పదు. సేద్యం ఇక మనకి సాధ్యం కాదు..."

కర్షక సమావేశానికి హాజరైన రైతులంతా ఓ యువ వక్త మాటలకు తుళ్ళిపడ్డారు. భయవిహ్వలులై అతడి వంక చూశారు.

రామన్నకైతే దుఃఖం గుండెలోతుల్లోంచి తన్నుకు రాసాగింది. బేలగా నిస్సహాయంగా చూశాడు.

"సమ్మె చెయ్యడానికి మనమేవన్నా ప్రభుత్వోద్యోగులమా! వాళ్ళు సమ్మె నోటీసిస్తే చాలు ప్రభుత్వాలు కాళ్ళ బేరానికొచ్చేస్తాయి. మనం రోడ్డెక్కి గుండెలు బాదుకున్నా సర్కారుకి చీమ కుట్టినట్టు కూడా ఉండదు. ఏదో మట్టి పిసుక్కునే వాళ్ళ గోల అనుకుని గుర్రు పెట్టి నిద్రపోతారు!" మరో యువరైతు లేచి ఆవేశపడ్డాడు.

"అలాగని పూరుకుంటే ఫర్లేదు. ఒకడుగు ముందుకేసి వ్యవసాయం శుద్ధదండగ మానేసెయ్యండి. పొలాలమ్ముకుని పట్నాలకి వలసపోండి. కూలీలుగా మారిపోండి – అవటాని సలహాలిస్తారు!" ఉక్రోషపడ్డారింకొకరు.

"అందుకే మనం పంట విరామం ప్రకటిద్దాం. ఇది తీవ్ర నిర్ణయమే. లోకానికి అన్నం పెట్టే చేతులిప్పుడు చేవచచ్చి చేతులెత్తెయ్యడం  కనీ వినని సంగతే. కాని తప్పదు. గత్యంతరం లేదు..."

వక్త మాటలకు కలకలం లేచింది.

"ఇప్పటికే అప్పుల ఊబిలో పీకల్లోతు దిగబడి పోయాం. నాగలి కర్రు ఆగితే ఉరిబోసుకోవాల్సిందే!" అన్నాడు రామన్న. అతడికి ఏడుపు ఒక్కటే తక్కువ!

అంతా అతడి వంక సానుభూతిగా చూసి 'అవునంతే. అలాగే ఉంది పరిస్థితి' అన్నట్టు చూశారు.

"ధవళేశ్వరం ఆనకట్ట కట్టకముందు మన ప్రాంతంలో ఎక్కడ చూచినా ఆకలి చావులే ఉండేవిట. ఇప్పుడు గోదావరి డెల్టాలో అడుగడుగునా అప్పుల చావులుంటున్నాయి. ఇక్కడే కాదు దేశమంతా ఇదే పరిస్థితి. 2005 నుంచి 2010 వరకూ దేశంలో సుమారు లక్షమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంట. ఆ వార్తని మీరంతా పత్రికల్లో చూసే ఉంటారు. అయినా ఏ ప్రభుత్వమైనా కించిత్తు కదిలిందా? మనకోసం ఏమైనా చేసిందా చెప్పండి?"

"పోలవరం ప్రాజెక్టు రాలేదు గాని కాలవలు తవ్వేసింది!" ఎవరో అన్నారు. నవ్వేరు కొందరు.

"అయిన వాళ్ళకి ప్రభుత్వ సొమ్ము అప్పనంగా దోచి పెట్టడానికే ఉపయోగపడ్డాయా జలయజ్ఞాలు. అదనంగా ఒక్క ఎకరాకీ నీరిచ్చిన పాపాన పోలేదు. మన పేరు జెప్పి పథకాలేశారు. అప్పులు చేశారు. అరకొర పనులు చేసి అంతా దోచుకున్నారు. ఆఖరికి నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని ఎరువులు, పనికొచ్చే పురుగుమందులు కూడా సరఫరా చెయ్యలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నాయి ఈ గుడ్డి ప్రభుత్వాలు. పేరుకి మాత్రం మనది వ్యవసాయిక దేశం. తీరా చూస్తే బొత్తిగా పట్టించుకోని రంగం వ్యవసాయమే...!"

"అవునవును. పరిశ్రమలు పెడతామంటే చవగ్గా స్థలాలిస్తారు. భారీగా అప్పులిస్తారు. వడ్డీ రాయితీలిస్తారు. ఎన్నో రకాల టాక్సు రిబేటులిస్తారు. ఆరుగాలం కష్టపడి మనం పండించే ధాన్యాన్ని కనీసం కొనేందుకు కూడా ఏర్పాట్లు చెయ్యరు!" ఒక వృద్ధ రైతు ఆవేదన పడ్డాడు.

"అది పచ్చి నిజం. కిలో బియ్యం రూపాయికిస్తామంటారు గాని అదే రూపాయికి కిలో ఎరువులో పురుగుమందులో ఇస్తామంటారా? అనరు. అంచేత మనం స్వచ్ఛందంగా క్రాప్ హాలిడేని ప్రకటించి ప్రభుత్వాన్ని హెచ్చరించక తప్పదు. మనం ప్రారంభిస్తే చాలు అనుసరించడానికి కడుపు కాలు తోన్న రైతు లెందరో సిద్ధంగా ఉన్నారు. అప్పుడదో ఉద్యమరూపం సంతరించుకుంటుంది. ప్రభుత్వం దిగి వస్తుంది"

"నీ పేరేంటి బాబూ" రామన్న లేచి వక్తని అడిగాడు.

"సత్యమూర్తి బాబాయ్...."

"నీ మాటలు వినడానికి వినసొంపుగా బాగానే వున్నాయి గాని పంట వెయ్యకపోతే ఏం తిని బతకాల! అప్పులోళ్ళు యములోళ్ళు, పీకల మీద కూర్చోకుండా వూరుకుంటారా చెప్పు!"

"మనం పండించినా పండించక పోయినా మనకి మిగుల్తున్నవి అప్పులే కదా బాబాయ్. గత ఖరీఫ్‌లో రబీలో ఏం జరిగిందో ఒక్కసారి గుర్తు తెచ్చుకుందాం..."

అతడి మాటలకి చప్పున కూర్చుండిపోయాడు రామన్న. దుఃఖోధృతికి అడ్డుకట్ట వెయ్యడం సాధ్యంగాకుండా ఉందతడికి.

ఖరీఫ్‌లో కాలువ మరమ్మత్తుల పేరుతో జూన్ నెలాఖరుకి గాని నీటిని వదల్లేదు. దాంతో నాట్లు ఆలస్యమయ్యాయి. నవంబరులో పంటలు కోత దశకు వచ్చేసరికి భారీ వర్షం ముంచెత్తింది. వరి చేలు మునిగిపోయాయి. డ్రెయిన్ల మరమ్మతుల గురించి ప్రభుత్వం పట్టించుకోనందున అవన్నీ పూడుకుపోయాయి. దాంతో చేలో నిలిచిన నీరు డ్రెయిన్ల గుండా వెళ్ళలేక చేలో తిష్ఠ వేశాయి. ప్రభుత్వ నిర్లక్ష్యానికీ ప్రకృతి ఆగ్రహానికీ తల్లడిల్లి

పోతూనే గుండె దిటవు చేసుకుని మునిగిన పంటని రక్షించుకోడానికి నానా యాతన పడ్డారు. ఎక్కువ మంది కూలీల్ని పెట్టి ఎలావోలా పంట కోయించి ఒడ్డుకి చేర్చారు.

తీరా ధాన్యాన్ని అమ్మబోతే తడిసి రంగు మారిన ధాన్యాన్ని కొనడానికి ఫుడ్ కార్పొరేషన్ ముందుకి రాలేదు. ఇతర కొనుగోలు కేంద్రాలూ ఆశక్తత చూపాయి. కడకి అయినకాడికి మిల్లర్లకి తెగనమ్ముకోవాల్సి వచ్చింది!

క్రాప్ ఇన్స్యూరెన్సు ఇప్పిస్తాం, ఋణాలు రీషెడ్యూలు చేయిస్తాం, కొత్త ఋణాలిప్పిస్తాం - అంటూ నాలుగు రోజులు హడావిడి చేసి మళ్ళీ తాబేలులా పెంకులోకి ముడుచుకుపోయింది ప్రభుత్వం!

అయినా మూల వర్షం ముంచినా జ్యేష్ఠ వర్షం తేలుస్తుందన్న ఆశతో మళ్ళీ అప్పుచేసి మళ్ళీ దుక్కిదున్నారు. చంటి పిల్లాడిని సాకినట్టు సాకారు. రబీలో ధాన్యం దిగుబడి పెరిగింది. కష్టాలు గట్టెక్కుతాయని సంబరపడ్డారు. కాని కనీస మద్దతు ధరకన్నా 150 - 200 తక్కువ ధరకి కొంటామన్నారు.

'ఇద్దెక్కడి ఘోరంరా దేవుడా' అని ఆందోళన పడుతూ మార్కెట్ యార్డ్‌కెళ్తే గేటుపాసుల పేరుతో టోకెన్లు చేతిలో పెట్టారు. వాటిమీద 15 రోజుల తర్వాతి తారీఖు వేసి అప్పుడు రమ్మన్నారు. బిచ్చగాళ్ళలా చూసినా విసుక్కున్నా భరించారు. కూలీలు లేరు, సంచులు కాటాలు లేవు, తేమశాతం తెలుసుకునే మిషన్లు లేవని గునిశారు. పిమ్మట యార్డుల్లో గోడౌన్లు ఖాళీలేవనీ, సొంతపూచీ మీద ధాన్యాన్ని టార్పాలిన్ కప్పి రక్షించుకోవాలనీ, కొనేదాకా నిరీక్షించాలనీ చావు కబురు చల్లగా చెప్పేరు. అప్పుల ఒత్తిడి తట్టుకోలేక ఎలాగో కష్టార్జితాన్ని అమ్ముకునే సరికి తలప్రాణం తోకకొచ్చింది!

రామన్నతో సహా అంతా ఆ చేదు అనుభవాలని గుర్తు చేసుకున్నారు. నిట్టూర్చారు. వాతావరణం మరింత గంభీరమైంది.

"దేశంలోని ప్రతి రంగానికీ తాము ఉత్పత్తి చేసిన వస్తువులకు ధర నిర్ణయించుకునే హక్కుంది. రైతులకి మాత్రం లేదు. రేయింబవళ్ళూ కష్టించి పని చేసినా మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద బతకాల్సి వస్తోంది. ఇక మంత్రులూ అధికార్లూ కాగితాల కబుర్లు చెబుతారు గాని పనులు చెయ్యరు. ఈసారి కాలువ మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేస్తాం, పూడికలు తీయిస్తాం, అవసరానికి నీరందిస్తాం - అన్నారు. ఇంత వరకూ ఆ పనులు మొదలు పెట్టనే లేదు. వర్షాలు మొదలయ్యాక తూతూ మంత్రంగా కాలువ పనులు ముగించేసి సొమ్ములు మింగేస్తారు. ఇలా ప్రభుత్వ నిర్వాకాల గురించి ఏ కరువు

పెట్టడం దండగ. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది తప్ప ఎలాంటి ప్రయోజనమూ లేదు. ఇక మనం తెగించాలి. తలకి చుట్టుకునే పైపంచెని నడుంకి కట్టుకుని ఉద్యమించాలి. లేకపోతే రైతు అనేవాడీ భూమ్మీద మిగలడు...!"

సత్యమూర్తి మాటల్ని మరికొందరు బలపర్చారు.

"మనం గొంతు సవరించుకోక తప్పదు. నిరసన జెండా ఎగరెయ్యకపోతే మన బతుకులు మరింత అధ్వాన్నమైపోతాయి" అన్నాడో పెద్దాయన.

తర్జన భర్జనలు పడ్డాక పంట విరామ నిర్ణయాన్ని ఆమోదించింది కర్షక సమావేశం.

"మన చుట్టు ప్రక్కల రైతుల్ని కలిసి వాళ్ళను కూడా ఒప్పిద్దాం. రైతుల్నందర్నీ ఒక్క త్రాటి మీదకి తెస్తే చాలు ప్రభుత్వం దిగొస్తుంది" ఒకరు ఆవేశంగా అరుస్తూ చెప్పేరు.

రాజనాలు పండించి జనానికి అన్నం పెట్టే రైతు సాగుకు సెలవివ్వడానికి నిర్ణయించుకున్నాడు! నూటికి 65శాతం జనం వ్యవసాయం మీద ఆధారపడి వున్న దేశంలో ఎంతటి విషాదకర పరిస్థితి!!

బరువెక్కిన గుండెల్తో కాళ్ళీడ్చుకుంటూ ఇంటికెళ్ళాడు రామన్న.

కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిచ్చి "మీటింగులో ఏమైంది" అడిగింది ఇల్లాలు.

"ఈ సారికి పంట వెయ్యొద్దన్నారు"

బుగ్గలు నొక్కుకుని చిత్రంగా చూసింది. "మరేం సెయ్యాల?"

"ఏం చేస్తే వాళ్ళకెందుకే. వాళ్ళవన్నీ కడుపు నిండిన బేరాలు. మధ్యలో మన్లాంటి సన్నకారు రైతులే నలిగి పోతారు"

"మరెందుకొప్పుకున్నారు?"

"శానా శానా చెప్పేర్లే. కుర్రాళ్ళేదో ఎగుర్తోంటే అదిలించక పెద్దాళ్ళూ తలాడించారు, చూడు చోద్యం"

"నలుగుర్తో కలవకుండా వుండగలమా?"

"వాళ్ళతో కలిస్తే కాళ్ళు కడుపులో పెట్టుకుని పడుకోడమేనే పిచ్చిదానా!"

"మరప్పుడు ముద్దెక్కడ్నుండొస్తాది? ఉప్పూకూడా అప్పూ పుట్టదు!" ఆమె స్వరం గద్గదమైంది.

"ఎరువుల కొట్టాయనా ఊరుకోడు బ్యాంకోళ్ళూ ఊరుకోరు. మన బాధ వాళ్ళకేం తెలుస్తుందీ! ఎవరి చావు వాళ్ళే చావాలంటారు!"

"తాళిబొట్టూ తాకట్టు పెట్టేశారుగా!" నిష్ఠూరంగా గునిసింది.

"ఏం చెయ్యనే. బంగారానికే విలువ. మనిషికి లేదు. మాటకి లేదు!"

"మరేం సేత్తానంటావ్?"

జవాబు అతడికీ తెలీదు. ఇతర రైతుల్తో కలిసి సాగలేదు. అలాగని ఉలిపికట్టె దారి పట్టనూలేదు. మరో ప్రశ్న ఎదుర్కోగల శక్తి లేక పైపంచె దులపరిస్తూ లేచి పొలం వైపు అడుగులేశాడు.

గట్టు మీద కూర్చుని తడి కళ్ళతో పొలం పంక చూశాడు రామన్న.

బిక్కు బిక్కుమంటూ చూస్తోంది పొలం. రైతుపాద స్పర్శకి పులకరించే భూమి సైతం దిగులుగా వుంది. దాని ప్రక్కనే గల ఆకుమడి కోసం సిద్ధం చేసిన మడిచెక్క అనాథలా చూస్తోంది.

గుండె పట్టేసినట్టు విలవిల్లాడాడు రామన్న .

ఊరి దుకాణాల్లో పేరుకుపోయిన బాకీలూ తడిసి మోపెడైన బ్యాంకు అప్పులూ గుర్తొచ్చాయి.

పంట విరామాన్ని పాటిస్తే రొటేషన్ ఆగిపోతుంది. ఇక ఈ ఆర్నెల్లూ ఏం తినాలి? అరువెవరిస్తారు? మళ్ళీ పంటకి అప్పెక్కడ పుట్టుద్ది?

భయాల భూతాలు కోరలు చాచి నిర్దాక్షిణ్యంగా నమిలేస్తోంది. మౌనంగా రోధించాడు.

రైతులు ప్రారంభించిన పంట విరామ ఉద్యమం రోజు రోజుకీ బలపడుతోంది. తూర్పుగోదావరి జిల్లాలోని 16 మండలాల్లోని 13 మండలాల్లో పంట విరామాన్ని ప్రకటించారు.

'రైతులకు అంత సీన్ లేదు' 'ఎక్కడో ఒకళ్ళిద్దరు పంటలు వేయనంత మాత్రాన వచ్చిన నష్టమేమీ లేదు' అంటూ మంత్రులు చేసిన ప్రకటనలు అగ్నికి ఆజ్యం పోశాయి. తమ సత్తా ఏమిటో చూపించాలనుకుంది రైతాంగం.

ఉద్యమం మరిన్ని ప్రాంతాలకు విస్తరించింది. వేల మంది కర్షకులు నిరసన స్రవంతిలో కలుస్తున్నారు. తాపీగా నిద్రలేచిన ప్రభుత్వం రైతుల్తో చర్చించి తగిన సిఫారసులు చేయమని ఒక కమిటీని నియమించింది.

ఆ వార్త లేవీ రామన్నని ఉత్తేజ పరచలేకపోయాయి. భవిష్యత్తు అగమ్య గోచరంగా వుండి కలత నిద్ర పాల్జేస్తోంది. వరి పంట ఆపొద్దని ప్రభుత్వం నచ్చ చెబుతుందని తాయిలాలిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాడు!

అతణ్ని వెదుక్కుంటూ వచ్చాడు మరో రైతు నందనరావు.

"ఏమిటిలా దారి తప్పి వచ్చావ్!" బాధతో కమిలిన అతడి ముఖాన్ని చూస్తూ అడిగాడు రామన్న.

"బ్యాంకోళ్ళు కాబూలీవాళ్ళని మించిపోయారు. మంచీ మర్యాద లేకుండా మనల్ని వీధుల్లోకి లాగుతున్నారు....." అన్నాడు నందనరావు.

రామన్న గొంతు తడారిపోయింది. గత రెండు పంటలూ దెబ్బతినడంతో తనూ బ్యాంకు అప్పు కట్టలేదు. ఈసారి కొంతైనా జమ చెయ్యొచ్చనుకుంటే అసలు పంటే లేకుండా పోయింది!

"రేపో మాపో వెళ్ళి కలవాలి. ఇలాంటి పరిస్థితొచ్చిందని చెప్పి కడుపో కాలో పట్టుకోవాలి. ఇంకో ఏడాది పాటు గడువు పెంచమని దండ వెట్టుకుని రావాలి. అసలిది వరకే వెళ్దామనుకున్నాను. ముఖం చెల్లలేదు..." నిట్టూరుస్తూ అన్నాడు.

"ఎంత ఖర్మొచ్చి పడిందో చూడు. అన్నం పరబ్రహ్మ స్వరూపమంటారు. దాన్ని సృష్టించే అన్నదాతకి పిసరంత గౌరవం ఇవ్వరు"

"గౌరవించకపోయినా ఫర్లేదు మన కష్టం గ్రహిస్తే చాలు!"

"నీ పిచ్చిగానీ మన కష్టాలూ కన్నీళ్ళూ వాళ్ళకి పడతాయేంటీ. వాళ్ళకి రూల్సూ కాగితాలూ కావాలి గాని, జనం అక్కర్లేదు. పెద్ద పెద్దోళ్ళకి కోట్లు దోచిపెడ్తారు. పంట పండిస్తామయ్యా అంటే రూపాయివ్వరు. మాసెడ్డ బరువై పోయింది మన బతుకు. ఒకేల బ్యాంకు వాళ్ళేమైనా చిందులేసినా మనం పట్టించుకోకూడదు రామన్నా....." అన్నాడతడు.

ఏదో అనుమానం రాగా ఆగి అతడి మొఖంలోకి సాభిప్రాయంగా చూశాడు రామన్న. తలదించుకున్నాడతడు.

గుండె దడ దడలాడుతోంటే అన్నాడు "బ్యాంకోళ్ళు.....!"

"అప్పులు చెల్లించని కొందరు రైతుల ఫొటోలు నోటీసు బోర్డులో పెట్టారు...."

"నా...ది... కూడా ఉందా?" నిలువునా కంపిస్తూ అడిగాడు.

నిలువుగా తలాడించాడు నందనరావు. మొదలు తెగిన వృక్షంలా కూలబడ్డాడు రామన్న.

ఏమయ్యిందంటూ గుండెలు బాదుకుంటూ వచ్చింది ఇల్లాలు.

"అయిపోయిందే. అంతా అయిపోయింది. మన పరువూ మర్యాదా గోదాట్లో కలిసి పోయాయి. తినడానికి లేకపోయినా వ్యవసాయదారులమంటూ గొప్పగా చెప్పుకునేవాళ్ళం. తలపాగా కట్టుకుని సగర్వంగా తిరిగేవాళ్ళం. ఇప్పుడు మనల్ని దొంగల్ని చేసేశారే. పోలీసుస్టేషన్లో దొంగల ఫొటోలు పెట్టినట్టు బ్యాంకోళ్ళు నా ఫొటో...!"

ఆ సరికే ఆవిడ కుప్పకూలిపోయింది.

"అంతిదవ్వొద్దు. నీదే కాదు ఇంకో పది మంది ఫొటోలు కూడా పెట్టారు. ఇదేం దారుణపని మనోళ్ళెళ్ళి నిలదీస్తామన్నారు. ధైర్యంగుండాలి మరి..."

క్షణాల్లో ఈ వార్త ఊరంతా తెలిసిపోయింది.

అందరూ వచ్చి ఓదార్చారు. బ్యాంకోళ్ళనీ ప్రభుత్వాన్నీ తిట్టిపోసారు.

"రైతుని క్షోభపెడితే రాజు అయినా మంత్రి అయినా మట్టిగొట్టుకు పోవాల్సిందే" అని శపించారు.

ఇవాళ రామన్న. రేపు ఇంకొకరు. ఎల్లుండు తామే ఆ స్థితిలో వుండొచ్చన్న ఊహ రైతు కుటుంబాలని కుదిపేస్తోంది. భయ భ్రాంతుల్ని చేస్తోంది.

ఆ సంఘటనతో అభిమానధనులైన రైతన్నల గుండెలు భగభగమని రగిలాయి!

తోటివారి ఓదార్పుకి మరింత ఖిన్నుడయ్యాడు రామన్న. తలపైకెత్తి ఎవరి ముఖంలోకీ చూడలేకున్నాడు.

ఆ రాత్రి రామన్న ఇంట్లో ఎవ్వరూ భోం చేయలేదు. భార్య, పిల్లలు దిగుల్తో వెక్కిళ్ళు పడుతూ కలత నిద్రపోయారు.

రామన్నకి పొడికళ్ళు పడ్డాయి. కళ్ళు మూస్తే చాలు బ్యాంకు నోటీసు బోర్డులో పెట్టిన తన ఫొటోయే కన్పిస్తోంది! దుఃఖం పొంగి పొరలి వస్తోంది!

తనేమీ సంచారజాతి వాడు కాదు ఊరొదిలి పోవడానికి. నాలుగెకరాల ఆ సామి. భూమినే నమ్ముకున్న రైతు బిడ్డ. భూమికి వేరైన మొక్క బతకదు. పరిస్థితులు విషమిస్తున్నా భూమి కరుణిస్తుందన్న ఆశతో తరతరాలుగా భూమినే అంటి పెట్టుకునున్నాడు. పుట్టిన ఊళ్ళోనే జీవిస్తున్నాడు. వ్యవసాయమే తన బతుక్కి ఆధారం.

ఇవన్నీ బ్యాంకు వాళ్ళకి తెలుసు. అయినా కొన్ని వేల బాకీకోసం తనని అనుమానించి ఘోరంగా అవమానించడం భరించలేకుండా ఉన్నాడు. నడిబజార్లో శిలువ వేయబడ్డట్టుగా తల్లడిల్లి పోతున్నాడు.

ఒకరకమైన తెగింపు వచ్చింది. అర్ధరాత్రి లేచి అటక మీద పెట్టిన పురుగు మందు డబ్బాతీశాడు. చప్పుడు చెయ్యకుండా ఇంట్లోంచి బయటపడి పొలం వైపు నడిచాడు రామన్న.

అమావాస్య చీకటి, కీచురాళ్ళ రొద, దూరాన కుక్కల అరుపులు...ఇవేమీ పట్టించు కోకుండా విసవిసా నడుస్తున్నాడు. ఉద్విగ్నుడై ఊగిపోతున్నాడు.

పొలం దగ్గర ఆగి తేరపార చూశాడు.

తన ఆస్తి ,పరువు, బతుకు, నేస్తం, అండ – అన్నీ ఆ కాస్త భూమే.

అకాల వర్షాలూ తీవ్రగాలులూ సమయానికి నీరందించని కాలువలూ తనని దెబ్బ తీశాయేమోగాని భూదేవి ఎన్నడూ దగా చెయ్యలేదు. నాగలితో భూమి గుండెల్ని చీలుస్తున్నా తల్లిలా నవ్వుతూ తిండిగింజల వరాలిస్తూనేవుంది. కష్టానికి తగ్గ పంట లభిస్తూనే వుంది. కాని ఫలం మాత్రం దక్కటం లేదు!

కొనబోతే కొరివి. అమ్మబోతే అడివి!

నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పసలేని పురుగు మందులు!

సకాలానికి అందని అప్పులు, అధిక వడ్డీ రేట్లు, దిగుబడితో సంబంధం లేని ఋణ చెల్లింపు షెడ్యూళ్ళు!

మద్దతు ధరలేమి, అరకొర మార్కెటింగ్ సౌకర్యం, దళారులు, మిల్లర్లు, లంచగొండి అధికారులు, అసమర్థ వ్యవసాయశాఖ!

రైతు నడుం విరుస్తోంది ప్రకృతి విపత్తులు కాదు మార్కెట్ శక్తులే!

వారి పద్మ వ్యూహం నుంచి బయటపడలేక ఒంటరి పోరాటం చేస్తున్నాడు నేటి రైతు!

అసలే 'పంట విరామం ప్రకటించారే' అని కాలూ చెయ్యీ ఆడక అల్లల్లాడుతుంటే బ్యాంకోళ్ళు తన పరువుని నడిరోడ్లో ఉరితీశారు! గుండెగాయం పై గొడ్డుకారం చల్లారు!

అరచేతి రేఖలు అరిగిపోయే దాకా అరక దున్నడం, పొలకంకుల్ని పసిపాపల్లా సాకడం మాత్రమే తెలిసిన సాగుదారను గజదొంగలా చూస్తున్నారు!

ఇంత అవమానం జరిగాక ఇక బతకడం అనవసరం. నవ్వులపాలై బతికే కన్నా చావడం మేలు!

క్షణకాలం కళ్ళముందు భార్యాబిడ్డలు మెదిలారు. గుండె గొంతుక్కేదో అడ్డం పడింది. మరుక్షణం 'దిక్కులేనోళ్ళకి దేవుడే దిక్కు' అని సర్దిచెప్పుకున్నాడు.

పురుగు మందు డబ్బా మూత తీసి దాని వంక వెర్రిగా చూశాడు. అది చీడపురుగుల్ని చంపుతుందన్న గ్యారంటీ లేదు. కాని, రైతుల్ని మాత్రం ఖచ్చితంగా చంపుతుంది.

మరేమీ ఆలోచించకుండా గడగడా తాగేశాడు.

పొలంలో పడి కొట్టుకుంటోన్న రామన్నని అటుగా వెళ్తున్న ఇద్దరు చూసి లబదిబో మంటూ కేకలు పెట్టారు. మరి నలుగురు పోగయ్యారు. చేతుల మీద మోస్తూ తీసుకెళ్ళి ఆసుపత్రిలో చేర్చారు.

గండం గడిచింది. ఊపిరి పీల్చుకున్నారంతా.

"బతుకన్నాక కష్టం కన్నీళ్ళూ వుంటాయి. ఆ మాత్రానికే బెదిరిపోయి చావే పరిష్కారం అనుకుంటే ఎలా రామన్నా" అంటూ సన్నగా మందలించారు.

"నీకింత స్వార్థం వుండనుకోలేదు. మాకింత పురుగుమందు పోయకుండా నువ్వొక్కడివే తాగేత్తావా. ఇదేవన్యాయమయ్యా. మేవేం పాపం చేశాం?!" అంటూ నిలదీస్తూనే బావురు మంది ఇల్లాలు.

పిల్లలు చెరో రెక్క కిందా దూరి 'నాన్నా' అంటూ వెక్కి వెక్కి ఏడ్చారు.

"మన రాత ఇలా మారడానికి్కారణం చోద్యం చూస్తోన్న ప్రభుత్వమే" అన్నారు అనునయించడానికొచ్చిన కర్షక సమితి నాయకులు.

"మనం గంగిగోవుల్లా వుంటే కాదు. కొమ్ము విదిలించాలి. కాలు దువ్వాలి. కడుపులో ఆకలి ఉన్నంత వరకూ ఈ లోకానికి రైతు అవసరం ఉంటుంది. అంచేత మన బతుకుల్ని దుర్భరం చేస్తున్న సమస్యల్ని పట్టించుకోని ప్రభుత్వంపై ఎదురు తిరుగుదాం ఇప్పటికే క్రాప్‌హాలిడే రెండున్నర లక్షల ఎకరాలకు విస్తరించింది. తూర్పు పశ్చిమగోదావరి జిల్లాలు దాటి ప్రకాశం, గుంటూరు, కడప, ఖమ్మం వరకు పాకింది. వరి సాగు ఆగినందున వెయ్యికోట్లకు పైగా ఆదాయ వనురులను ప్రభుత్వం కోల్పోతుంది. రైతు తన శక్తి విలువ సంఘటిత శక్తి బలం తెలుసుకుంటున్నాడు. మనం పోరాడితే పోయేవి మన కష్టాల సంకెళ్ళే. నలుగుర్తో చేతులు కలుపు. పిడికిళ్ళు బిగించు రామన్నా"

వృద్ధ నాయకుడి ఉద్బోధకి రామన్నకి మొండి ధైర్యం వచ్చింది.

పంట విరామం వల్ల కష్టనష్టాలు పెరుగుతాయని తను మథన పడ్డాడు తప్ప ఉజ్వల భవిష్యత్తు దృష్ట్యా అది తాత్కాలిక నష్టమే అని గ్రహించలేకపోయాడు. భవిత బావుండాలంటే కొంత త్యాగం తప్పని సరి – అని ఇప్పుడు అర్థమవుతోంది!

ఎవరికి వారు ఏకాకులై రోదించే కన్నా అంతా ఏకమై నినదిస్తే పాలకులూ ప్రభుత్వాలూ దిగి రాక తప్పదు. శాశ్వత పరిష్కార మార్గాలు చేబట్టకా తప్పదు!

భవిష్యత్తుపై భరోసా చిక్కింది. 'సై' అంటూ తలాడించాడు.

"రేపు స్వామినాథన్, మోహన్ కమిటీల రిపోర్టుల్ని అమలు పర్చమని డిమాండ్ చేస్తూ ఊరేగింపు చేస్తున్నాం. మనవన్నీ ఉమ్మడి సమస్యలు. ఆ సంగతి గుర్తు పెట్టుకుని అందరితో చేతులు కలుపు బాబాయ్. మనల్ని అన్ని పక్షాలూ అన్ని పార్టీలూ బలపరుస్తున్నాయి. న్యాయం ధర్మం మన వైపున వుంది. మన నిరసనోద్యమం విజయవంతమై తీరుతుంది. మనం చేయాల్సిందల్లా 'జాతికి జనానికి వెన్నెముకలం' అని చాటి చెబుతూ

వెన్ను చాచి నిటారుగా నిలబడడమే!"

సత్యమూర్తి మాటలు మరింత ఉద్విగ్న పరిచాయి.

"పొలాల గుండెల్లోంచి పొగగొట్టాలు లేపుతామంటే సెజ్‌లకు వ్యతిరేకంగా ఎదురు తిరుగుతున్నారు రైతులు. థర్మల్ ప్లాంట్లు నెలకొల్పి పొలాల్ని బూడిద కుప్పలుగా మారుస్తామంటే తుపాకీ గుండ్లకు గుండెలొడ్డుతున్నారు రైతుజనం. బిడియాలూ భయాలూ సంకోచాలూ సానుభూతులూ వద్దు. నడుం బిగించి కదుల్దాం రా" మరో రైతు నాయకుడన్నాడు.

"ఇంటిల్లపాదీ వస్తాం. చేయి కలుపుతాం. కదం తొక్కుదాం" ఉద్రేకంతో ఊగిపోయాడు రామన్న.

అతడిలో ఆత్మవిశ్వాసం నింపగలిగినందుకు సంతోషిస్తూ అభినందన పూర్వకంగా చూస్తూ భుజం తట్టారు.

* * *

రైతు జనసముద్రం ఊరేగింపుగా కదిలింది. ఆడా మగా పిల్లా పాపా రైతులు కూలీలు అంతా పాల్గొన్నారు. తాడో పేడో తేల్చుకోవాలన్నట్టుగా పోరు బాట పట్టారు.

వ్యవసాయాభివృద్ధి పథకాలు, నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ యంత్రాలు, లాభసాటి మద్దతు ధరలు, పటిష్టమైన మార్కెటింగ్ వ్యవస్థ, పారదర్శక పంటల భీమా, స్వల్ప వడ్డీకి ఋణాలు, చీడపీడల నివారణకు అగ్రి క్లినిక్కులు, ఎగుమతికి అనువైన నాణ్యత గల ఉత్పత్తులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో రైతు సంఘాలకు ప్రాధాన్యత – డిమాండ్ చేస్తూ కదిలారు.

ఏక కాలంలో తమ ఆక్రందన విన్పిస్తూ నిరసన తెలియజేస్తూనే 'ఇది మా హక్కు సాధించుకుని తీరతాం' అంటూ నినదించారు.

"నీరోల ఫిడేళ్ళని ధ్వంసం చేస్తాం. అభినవ నీరోలకు బుద్ధి చెబుతాం" అంటున్న అన్నదాతల ఘోష అంబరాన్ని తాకుతోంది.

పాలకుల కాళ్ళ క్రింది భూమి కదుల్తోంది.

తల్లి భూదేవి పురుటి నొప్పులు పడుతోంది!

**(ప్రజాశక్తి 12-2-2012)**